# కంకాళమూర్తి

ఆ చెట్టే పెట్టని పెట్టని గోడ – కట్టనియిల్లు ఆశ్రయమిచ్చిన వ్యక్తి కనికరించిన దాత కరువైపోయారు ఇలాంటి సోదరీలుఎందరో!

★ అన్వేషి ★

అది ధనికుల్ని దివ్యభవనాల్లోకి- చల్లని శీతల ప్రదేశాలికి పంపేఎండ.

దరిద్రుల్ని చెట్లనీడల్లోకి పూరిగుడిసెల్లోకి తోలే ఎండ.

ఆనాడు ఆదివారం.

మిట్టమధ్యాహ్నం.

చైనాబజారు పోతున్నా.

హైకోర్టు దగ్గర ఒక చెట్టు క్రింద గూడులేనిపక్షిలా ఒక జీర్ణకంకాళమూర్తి తన యిద్దరు పసిబిడ్డల్ని జోకొట్టూంది.

వాళ్లు పాలు ఆకలికి ఏడుస్తున్నారు. మరి తల్లికి వుంటేగా పాలువుండటానికి. నిద్ర ఆకల్ని, దరిద్రాన్ని మైమరపిస్తుందని ఆమెగోల.

కార్చిచ్చులాకడుపులో మండుతూంటే నిద్ర ఎక్కడ నుంచి వస్తుంది? పైకిచూస్తే చక్కనిపూవుల్తో నిండి వుంది చెట్టు. ఎందరో ఆ దారిని దాటారు. ఎందరో ఆ చెట్లపూవుల్ని చూచి ఆనందించారు కాని, చెట్టుక్రింద వున్న దరిద్రమూర్తి కనపడలేదు! కొందరు చూసికూడ పూర్వజన్మకర్మవల్ల కల్గింది కనుక సహాయంచేయడం తప్పని ఆదరించడం అవమానమని వాదన. కుంటి గ్రుడ్డి వారికికూడా ఆవాదనే ప్రయోగం! సభ్యతాప్రపంచం! పాపం ఎంతకాలంనుంచి దరిద్రంతో బాధపడుతుందో! ఆమెకు ఆచెట్టుక్రిందే శాశ్వతావాసం. ఆచెట్టే పెట్టని గోడకట్టనియిల్లు.

మరి ఆమెకు "నా" అనేవారు లేరు.

ఆ దీనమూర్తిగోడువినేవారులేరు ఆర్చేవారులేరు— తీర్చే వారంతకన్నా!......ఆశ్రయమిచ్చినవ్యక్తి కనికరించినదాత కరువైపోయారు.

ఇలాంటి సోదరీలుఎందరో! అని తలపోస్తూ వాపోసాను.

※

సంస్కరణలేని ఆమె దుస్తుల్ని—పోషణలేని ఆమె పిల్లల్ని-ఆమె ప్రసరించే బీదచూపులు—ముఖాన్ని దైన్యరేఖలు నాలో ఒక కదలిక—మార్పుకల్గించాయి.

ద్రవీభూతమైన హృదయంతో జేబు తడిమా.......ఒక చినుగులోంచివేలు బైటకొచ్చింది. పైకితలెత్తా నవ్వుతూన్నట్టు విచ్చినపువ్వులు నక్షత్రాల్లా తళతళ మెరుస్తున్నాయి.

అవన్నీ రత్నాలయితే బాగుండిపోను అనుకున్నాను.

ఇకఏమిచేయలేక రెండు వేడి కన్నీటిబొట్లు రాల్చా- ఒక దీర్ఘ నిట్టూర్పు విడిచా—

అంతే!-- నాసానుభూతి.

అంతలో ఒక జమీందారు అద్దాలకారులోపోతూ చెట్టుపువ్వుల వంక చూశాడు. ఎంత చక్కగ వున్నాయని లొట్టవేసాడు.

కాని ఆచూపు చెట్టుక్రింద శుష్కించిన విషాద జీవిపైన పడితే పదినిమిషాల్లో—ఆమె దరిద్రం ఎగిరిపోయేది అనుకున్నాను.

అంతలో ఒక పెద్దతుపాను రేగి యీ పాపిష్టి చెట్టు కూలిపోతే బాగుండును. పువ్వులురాలిపోతే బాగుండు ననుకున్నాను.

—ఆ—విలాపమే విప్లవమై—విజయవంతమై—ధనికగుండెల్ని ప్రేల్చివేస్తే— కఠినహృదయాల్ని కాల్చివేస్తే కనకసౌధాన్నికూల్చివేస్తే బాగుండేది అనుకున్నాను.

※

అదే కొన్నాళ్లకు సంఘువిప్లవమయింది.